జరిపివేస్తూ మా లక్ష్మణపంతులు స్వర్గానికి తెట్టతెన్ను పెట్టింది. రెండో ఇంద్రధనుస్సు మన అందరి కన్నీటి బిందువుల గుండా రంగులూనింది గాదుగదా ?

.... .... .... .... ....

## సిల్హౌటీ నృత్యాలు

ఇంట్లో మా అమ్మకు ఎటువంటి పవిత్రస్థానముండేవో ఊళ్లో మా తండ్రికి అటువంటి పేరుకీర్తులు వుండి వున్నాయి. నా తండ్రిన్నీ యిప్పుడులేడు. మేము మా తండ్రిని "నాన్న" అని పిలిచేవాళ్ళము. ఆ మహామహుడు 1919 ఫిబ్రవరిలో కాలంచేసినాడు. అప్పటికి నేను పెరిగి పెద్దవాణ్ణై విద్యాబుద్ధులు కలవాణ్ణైయున్నాను. అయినప్పటికీ నా జ్ఞానం నా విద్య నా బుద్ధి నా ఎదుగు నా ఏపు ఆనాడు కించిత్తూ నాకు వుపకరించలేదు.

ఆయన చాలా జబ్బుస్థితిలోనున్నాడు. అయినప్పటికీ "తండ్రి చనిపోతాడు" అనే విజ్ఞానం వివేకం నాలో అప్పటికి పుట్టివుండలేదు. తరువాతను పుట్టివుండిన్నీ ప్రయోజనకారి కాలేదు. ఎంచేతా అంటే తండ్రిని బ్రదికించుకునే అవకాశం మరి వమ్మయి పోయింది కాబట్టి. నేను చూడకుండానే ఆయన భౌతికం దహనపరుపబడింది.

"చూడకుండానే" అన్నానా ? అది సరియైన నివేదిక కాదు. చూచాను ! ఏమిచూచాను ? ఒకవైపున మహాజ్యోతి చూచాను ! ఆ వైపున అసలు మా వూరికి శ్మశానవాటిక లేనే లేదు. ఎప్పుడు ఆ వైపున కనబడ్డా నాకు ఎఱ్ఱని సూర్యాస్తమానమే

కనబడుతూవుండేది. అందుచేతను ఆ వైపున ఆ మునిచీకటివేళ ఆ రోజున నేను జూచిన మహాజ్యోతి నా కళ్ళముందు సూర్యాస్త మానంగానే ప్రవర్తించింది. నేను చూచినంతసేపూ మరో రీతి గానే తట్టలేదు. పెద్దకాంతి, పెద్దమంట, పెద్ద చెరువుగట్టుక్రింద మెలికతూమువోరనే మా మడిచెక్కమీద ప్రకాశమానంగా ఊగుతూవుంది. ఆ వెలుగు ముందు నల్లనినీడలు ఏవో కర్ర లుచ్చుకు కదలిస్తూవున్నట్టు గోచరించినాయి.

కాని మనస్సులో, ఆ దెసనెప్పుడూ సూర్యాస్తమానం యొక్క తేజోరాశి, ఆ తేజోరాశి ముందు "సిల్హ్వాటీ" నృత్యాలు వేర్పాటుగా గోచరిస్తూ రావడం వల్ల అవేమో అన్న ఆశాంతా లోచనయే నా లోపల! "తండ్రి" తండ్రి పోయాడు! తండ్రి చితి అక్కడ వెలుగుతోంది!" అన్న దృష్టి సుతరాం నాకు పోలేదు. చెబితే నమ్మండి! అదివాక మహత్తర మహోన్నత మహాప్రశస్త ప్రజ్వలనము! ప్రకాశము! ప్రతాపము!

ప్రతీ కుమారుడు అందులోను పెద్దకుమారుడు సర్వ సాధారణంగా తన తండ్రి పోయినప్పుడు దగ్గిరవుండడమో కనీసము అగ్నిసంస్కారసమయానకు అందుకోగలగడమో జరిగి తీరుతుంది—ఆ గొడవఅంతా ఎందుకిప్పుడు—అట్టిది నా విష యంలో జరగలేదనే యీ వ్యాసంలో వివరించదగ్గ విశిష్టాంశము. అయితే ఏమిటి దీనిలోని వింత అని పాఠకులడిగితే అడుగ వచ్చును. వారికి నా ప్రత్యుత్తరము ఈ వ్యాసం పూర్తిగా పఠించ వలసినదనే—

జడవకండి ఏదో "కాదు" అని. విడవకండి ఏదో వ్యక్తిగతమైన "గోడు" అని. చెప్పానుగా అసలు ఆ దెస

శ్మశానమేలేదని. మరి విచారమన్నది ఆ నిమేషమప్పుడు నాలో వుంచేగా మీరు విచారపడ్డానికి. అదో సూర్యాస్తమానపువెల్గు, ఆ వెల్గుముందు "సిల్హౌటీ" నృత్యం!

ఇలా నాకానొకదృశ్యం నా మనస్సును తనవైపున కాకర్షించుకుంటూవుంటే నా మిగతా చైతన్యమంతా ఎక్కడ వుంది? ఎటువైపునకు పోతూవుంది?

ఓ జట్కాలో కూర్చుని వూరువైపు సాగుతూవుంది. ఊరివైపంతా గాఢాంధకారం! అందులోను కోనేరు తూరుపున వున్న ఒలికిమెట్టను తిలకించే చింతచెట్ల ఆ ప్రాంతాన్ని మఱీ గాఢాంధకారం కమ్మివుంది. మిణుగురుపుర్వుకూడా ఎగురుతూ వున్న జాడలేదు. నాకు కబురట్టుకొచ్చిన అతడూ నేనూ జట్కాతోలే వాడూ ముగ్గురం వున్నాము జట్కాలో. జట్కాబండి వూరికోనేరు దరిసింది.

ఊరివారెవరో అన్నారు "పోయారు" అని. మఱి కొంచెంవెళ్ళేలో "దహనపరిచేశారు" అని. జట్కాదిగి మా యింటివాకిట అడుగుపెట్టేలో పదిమందీ ముందుకువచ్చి "సూర్యాస్తమానం కాకుండా దహనంకావలసివుంది అని శాస్త్రం ఉద్ఘోషిస్తూవుండడంవల్లనుంచి నీవు వచ్చేదాకా ఆపలేకపోయినాం! అన్నీ పూర్తిచేసికొని యిప్పుడిప్పుడే అక్కడనుంచి తిరిగి వచ్చాం" అన్నారు.

నేను ఆ క్రితందాకా చూచింది సూర్యాస్తమాన కాంతి కాదు. నా తండ్రిసొద! అని అప్పుడు గ్రహించ గలిగాను. గ్రహిస్తూ చంటిపిల్లవానిలా ఏడ్చాను.

ఇప్పుడు మనం ఆ స్థలంవద్దకు వెళ్ళిచూస్తిమా ఓ పచ్చని తియ్యమామిడిచెట్టు మొలిచి ఫలిస్తూవుంటుంది. దాని ఫలం

ఆసించకుండా జట్కా రస్తానే పయనిస్తూ పరకాయిస్తుమా ఆ వేళ కీనాడూ సూర్యాస్తమానమే కనిపిస్తుంది. ఆసూర్యాస్తమానం ముందు నేటికీ ఆ "సిల్హూటీనృత్యమే" వెలిగిస్తుంది!

.... .... .... .... ....

## వా సాం సి జీర్ణాని

"వాసాంసి జీర్ణాని"—అయితే వసనము జీర్ణించనిదై యుండగా దానిని విడిచినప్పుడు?—పై శ్లోకము చదివినప్పుడల్లా నాకు అలా జిజ్ఞాస వెనువెంటనే పోతూ వుంటుంది.

అప్పటిరేయి యిప్పటికీ నాకు బాగా జ్ఞాపకం—నేను—ఆమె—మేమిద్దరమే వున్నాం ఆ గదిలో. మళ్ళీ తెల్లారు నవసరములేనట్టుగా కనబడిందికాలం. మఱీన్నీ లోకమంతా ఆ చిన్నగదిలోనే ఇమడ్చబడి వున్నట్టుగా, మాకేమీ లోటు అనిపించలేదు. ఆ గదిలోని గాలికూనలన్నీ కల్పతరశాఖల చేతనే వీవబడినట్టు మాకు తగిలి ఆనందం గొల్పాయి.

ప్రేయసి యొకానొక నూతనాతినూతనమైన చుట్టుచెంగావి కోక ధరించి మఱుక్షణమందే దానినలా బుజాలక్రిందుగా, పృధుజ ఘనం క్రిందుగా దిగు దిగువ కూడ్చుకుంటూ, ఎందుకో చిరునవ్వు నవ్వింది, నన్నావంకకు చూడవద్దంటూ.—

"సరిక్రొత్తకోక నలా కట్టీకట్టకుండానే విప్పి పారవేస్తూ వున్నావేమిటి? ఛా!" అని క్రిందదడ్డచీరను ఆమెచేతి కందివ్వ బోయాను. "అది మీ కండువా! నా చీర అనుకొన్నాను—మీకొక కండువా నాకొక చీర—చుట్టుచెంగావిరంగు వేయించినవి పొందుపరిచి యుంచాను. అది మీది" అంది.